క్లుప్తంగా

వైద్య శిబిరానికి స్పందన



రోగులను పరీక్షిస్తున్న కంటి వైద్య నిపుణులు

బొండపల్లి: మండలంలోని బి.రాజేరు గ్రామ సచివాలయం ఆవరణంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. విజయనగరంలోని వెంకటరామా ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో బి.రాజేరు గ్రామంతో పాటు చిన్నతామారాపల్లి, జి.పి.అగ్రహారం గ్రామాలకు చెందిన రోగులు పాల్గొన్నారు. కంటి వైద్య నిపుణులు రామునాయుడు వైద్య పరీక్షలను నిర్వహించారు. 14 మంది రోగులకు కంటి శస్త్ర చికిత్సలు అవసరం ఉన్నట్టు వైద్యులు గుర్తించారు. రోగులకు ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి వితరణ



ఆలయ నిర్మాణానికి నగదు అందజేస్తున్న దాతలు

చీపురుపల్లి: పట్టణంలోని శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో నిర్మాణంలో ఉన్న శ్రీ హరిహరపుత్ర అయ్యప్పస్వామి దేవాలయం నిర్మాణ పనులకు రూ.50,001 ఆర్థిక సహకారం లభించింది. విశాఖపట్టణంకు చెందిన ఇస్సరి నర్సింగరావు, లక్ష్మి, సతీష్, స్పందన, కోరాడ కనకమ మహాలక్ష్మి, శివకుమార్ దంపతులు రూ.50,001 వితరణగా అందజేశారు. శుక్రవారం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ మొత్తాన్ని ట్రస్టు బోర్డు సభ్యులు అప్పికొండ ఆదిబాబు, ఎస్వి జి.శ్రీనివాసరావు, గంట్యాడ సీతరాజు, గుడ్ల శ్రీనివాస్‌లకు అందజేశారు.

వైభవంగా స్వామివారి తులాభార సేవ



వేణుగోపాలస్వామి వారి తులాభార సేవ

జామి: మండలంలో ప్రసిద్ధి చెందిన అన్నంరాజుపేట పంచాయతీ పుష్పగిరిలోని వేణుగోపాలస్వామి ఆలయంలో గురువారం రాత్రి వేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా స్వామి వారి తులాభార మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ గావించారు. శుక్రవారం ఉదయం దేవతా హోమం నిర్వహించారు. ముందుగా స్వామి వారికి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నీటి వనరులను కాపాడుకుందాం



మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఈశ్వరరావు

జామి: నీటి కొరత రాకుండా నీటి వనరులను కాపాడుకోవలసిన బాధ్యత అందరిపైన ఉందని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు జాగరపు ఈశ్వరరావు అన్నారు. మండలంలోని జాగరం గ్రామంలో రైతులు, పలువురు ప్రజా ప్రతినిధులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నీటి ప్రాధాన్యత అంశాలను వివరించారు. రాబోవు రోజుల్లో నీటి కొరత రాకుండా భావితరాలను, పశు పక్ష్యాదులను కాపాడుకోవాలన్నారు. వాటి కోసం ఉత్తరాంధ్ర చెరువులు పరిరక్షణ సమితి కృషి చేస్తుందన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా ఉత్తరాంధ్ర వ్యాప్తంగా ప్రజలను చైతన్య పరచడం కోసం అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మరిశర్ల కృష్ణమూర్తినాయుడు, ఎంపీటీసీ పాడిపిరెడ్డి నరసింహనాయుడు, పలువురు రైతులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి స్నపన తిరుమంజనం



పసుపు అలంకరణతో శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి

వేపాడ: మండల కేంద్రం వేపాడలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామికి స్నపన తిరుమంజనం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త రావర్తి చిరంజీవి ప్రసాద్ మంత్రోచ్ఛరణాలతో స్వామి వారికి పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ అభిషేకం, పసుపు కుంకుమలతో అలంకరణ, నక్షత్ర హారతి, పట్టు వస్త్రాలంకరణ కార్యక్రమాలు నిర్వహించారు.

చేసిన మంచిని చెప్పి ఓటు అడగండి

- గడప గడపకు చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని తీసుకువెళ్లండి
- ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

బొండపల్లి: వైఎస్సార్ సీపీ పాలనలో ప్రజలకు చేసిన మంచిని చెప్పి ఓటు అడగాలని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. గడప గడపకు చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని తీసుకువెళ్లాలని పేర్కొన్నారు. మండలంలోని గొట్లాంలో గల సత్య ఫంక్షన్ హాల్‌లో బొండపల్లి, గంట్యాడ మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజకవర్గంలో డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా రూ.1800 కోట్లు సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పనులకు ఖర్చు చేసినట్టు చెప్పారు. రాబోయ 50 రోజులు చాలా కీలకమన్నారు. నిత్యం ప్రజల మధ్యనే నాయకులు, కార్యకర్తలు ఉండి అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 98 శాతం అమలు చేసి ఎన్నికలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెళ్తున్నారన్నారు. మాటిస్తే... చేస్తారంతే అన్న మాటను నిలబెట్టుకున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగనన్నకే దక్కిందన్నారు. రానున్న ఎన్నికల్లో జగనన్న ఎదుర్కొనే ధైర్యం లేక కూటమిగా ప్రతిపక్షాలు వస్తున్నాయని, తగిన గుణపాఠం చెప్పాలన్నారు. గతంలో కేంద్ర మంత్రిగా పని చేసిన అశోక్‌గజపతిరాజు హయాంలో భోగాపురంలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేసినా కనీసం తట్టెడు మట్టి అయినా వేశారా? అని ప్రశ్నించారు. కల్లబొల్లి మాటలతో కాలక్షేపం చేశారన్నారు. జగనన్న అధికారంలోకి వచ్చాక భూసేకరణ పూర్తి చేసి పనులు ప్రారంభానికి శ్రీకారం చుట్టారన్నారు. జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరు చేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో నాయకులంతా ఏకతాటిపై ఉంటూ విజయ ఢంకా మోగించాలన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు, ఎమ్మెల్సీ పి.సూర్యనారాయణరాజు(సురేష్‌బాబు), వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకుడు బీవీ ప్రభాజీరాజు, బొండపల్లి, గంట్యాడ మండలాల ఎంపీపీలు చల్లా చలంనాయుడు, పీరుబండి హైమావతి, జెడ్పీటీసీలు రాపాక సూర్యప్రకాశరావు, వర్రి నర్సింహమూర్తి, జిల్లా నాయకులు ఎం.నారాయణమూర్తిరాజు, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాలు నాయుడు, పార్టీ యువ నాయకులు బొత్స సాయి గురునాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు బోద్దల చిన్నంనాయుడు, జాగారపు అప్పారావు, ఎస్సీ సెల్ జిల్లా నాయకులు పీరుబండి జైహింద్ కుమార్, జేసీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఈదుబిల్లి కృష్ణ, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్‌లు పల్లి రఘు, రామసూర్యం, వైస్ ఎంపీపీలు మీసాల సరోజిని, జి.ఈశ్వర్రావు, నాయకులు మీసాల తులసీరాం, మహంతి రమణ, బండారు బంగారం, తాళ్లపూడి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



గర్భిణులకు, బాలింతలకు అవగాహన కలిగిస్తున్న సూపర్‌వైజర్

గజపతినగరం రూరల్: పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవడం వల్ల ప్రతీ ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని గజపతినగరం ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్‌వైజర్ శశికళ అన్నారు. మండలంలోని పాతబగ్గాం అంగన్‌వాడీ కేంద్రం 2లో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో గతంలో కన్నా మెరుగ్గా పూర్తి స్థాయి పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించడం జరుగుతుందన్నారు. చిరుధాన్యాలు, ఆకుకూరలు, బెల్లంతో చేసిన పదార్థాల వల్ల తయారుచేసే పదార్థాలు తీసుకోవడం వల్ల రక్తహీనత నుంచి బైటపడగలమన్నారు. పోషకాహారం తీసుకుంటే కలిగే లాభాలపై వారికి పూర్తి స్థాయిలో అవగాహన కలిగించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్.కనకదుర్గ, శారద, ఆయాలు, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

అక్రమ సస్పెన్షన్ రద్దు చేయాలని ఆందోళన

శృంగవరపుకోట: అక్రమ సస్పెన్షన్‌ను రద్దు చేసి డ్రైవర్‌ను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఎస్.కోట డిపోలో ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో గేటు ధర్నా శుక్రవారం నిర్వహించారు. ధర్నాలో యూనియన్ నాయకులు మాట్లాడుతూ మార్చి నెల 1న విజయనగరంలో ఎత్తు బ్రిడ్జి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో జి.కె.రాజును అక్రమంగా సస్పెండ్ చేశారన్నారు. ప్రమాదంలో గాయపడ్డ మహిళ పది రోజులు ఆస్పత్రిలో ఉన్న తర్వాత చనిపోయిందన్నారు. ఈ ఘటనలో డ్రైవర్ తప్పిదం ఏమీ లేకున్నా అక్రమంగా సస్పెన్షన్ చేశారన్నారు. వెంటనే అక్రమ సస్పెన్షన్ రద్దు చేసి డ్రైవర్‌ను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిపో కార్యదర్శి కొల్లి కోటేశ్వరరావు, అధ్యక్షులు ఎ.ఎస్.రావు, రీజియన్ కార్యదర్శి కె.కె.రావు, గ్యారేజి కార్యదర్శి ఎస్ఏ నాయుడు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

మెరకముడిదాం: మండలంలోని 17 సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తమ విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ ఎం.పావని శుక్రవారం హెచ్చరించారు. కొంతమంది సిబ్బంది ఉదయం విధులకు హాజరై మధ్యాహ్నం ఫీల్డ్ విజిట్‌కు వెళ్లినట్టు చెప్పి ప్రజలకు అందుబాటులో వుండకుండా వెళ్లిపోతున్నారన్న ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. ఇకపై ఇలా ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

నీటి సంరక్షణ అందరి బాధ్యత



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా న్యాయమూర్తి(డీఎల్ఎస్‌ఏ చైర్మన్) దుర్గయ్య

బొండపల్లి: ప్రతి నీటి బొట్టును సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందని జిల్లా న్యాయమూర్తి (డీఎల్ఎస్‌ఏచైర్మన్) జి.దుర్గయ్య పేర్కొన్నారు. మండలంలోని గొట్లాం గ్రామ సచివాలయం ఆవరణలో జాతీయ జల దినోత్సవంతో పాటు, ప్రజా ప్రయోజిత లోక్ అదాలత్ సేవలపై శుక్రవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు నీరు ఎంతో విలువైన వస్తువుగా మారిందన్నారు. ప్రకృతి ప్రసాదించిన దానిని కాపాడుకొని సంరక్షించడానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని చెప్పారు. చట్టాలు పట్ల ప్రతి ఒక్కరికి అవగాహన తప్పనిసరిగా ఉండాలన్నారు. మహిళలు, చిన్న పిల్లల రక్షణ కోసం అనేక చట్టాలు రూపొందించడం జరిగిందని వాటి పట్ల అవగాహన కలిగి ఉంటేనే రక్షణ పొందడానికి అవకాశం కలుగుతుందన్నారు. నీటి ప్రాముఖ్యత వాటి అవశ్యకతను ప్రతి ఒక్కరూ గుర్తించే విధంగా అయా శాఖలు అధికారులు ప్రజలుకు విస్తృతంగా అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ పి.ఉమా శంకర్, గజపతినగరం డీఈఈ జె.సునీత, ప్రాజెక్టు మేనేజరు ఆర్.లక్ష్మణరావు, తహసీల్దార్ హనుమంతురావు, ఎంపీడీఓ ఎస్.హరిహరరావు, ఆర్.లక్ష్మణరావు, పంచాయతీ కార్యదర్శి సి.హెచ్.నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రచారాలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

- ర్యాలీలు, రోడ్‌షోలకూ అనుమతులు ఉండాల్సిందే...
- పక్కాగా ఎన్నికల కోడ్ అమలు చేస్తాం...
- నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, ఆర్‌డీఓ శాంతి



చీపురుపల్లి: నాలుగు మండలాల అధికారులు, రాజకీయ పార్టీలతో ఎన్నికల నియమావళిపై అవగాహన సమావేశం నిర్వహిస్తున్న ఆర్‌డీఓ శాంతి

చీపురుపల్లి: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళి తప్పనిసరిగా పాటించాల్సిందేనని చీపురుపల్లి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్‌డీఓ బి.శాంతి చెప్పారు. ఎన్నికల నియమావళి, కోడ్ అమలు తదితర అంశాలపై రాజకీయ పార్టీలతో పాటు నాలుగు మండలాల అధికారులతో శుక్రవారం స్థానిక ఆర్‌డీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున రాజకీయ పార్టీలు ఎన్నికల కమిషన్ సూచించిన నియమావళిపై పూర్తి అవగాహన కల్పించుకుని ప్రచారాలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. నియోజవకర్గంలో 257 పోలింగ్ కేంద్రాలు, 160 లొకేషన్లు, 33 సెక్టార్లుగా విభజించామన్నారు. నియోజకవర్గంలో ఎక్కడ ఎలాంటి కార్యక్రమం జరిగినా సూక్ష్మ స్థాయిలో పర్యవేక్షణ ఉంటుందన్నారు. నాలుగు మండలాల్లో ఉండే తహసీల్దార్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులగాను, ఎంపీడీఓలు మోడల్ కోడ్ అమలుకు సంబంధించి నోడల్ అధికారులుగాను వ్యవహరిస్తారని చెప్పారు. గరివిడిలోని ఎస్‌డిఎస్ అటానమస్ కళాశాలను డిస్ట్రిబ్యూషన్ కేంద్రంగాను, ఓట్లు లెక్కింపును విజయనగరం లెండి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తామన్నారు.

వారం ముందే అనుమతులు

ఎన్నికల కమిషన్ ఆదేశాలు మేరకు రాజకీయ పార్టీలు ప్రతీ అనుమతిని సువిధ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పెద్ద ర్యాలీలు, రోడ్‌షోలకు వారం రోజులు ముందే ఎన్నికల కమిషన్ అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రచారం, సమావేశాలు, ఊరేగింపులు, ఇంటింటి ప్రచారం, స్పీచ్‌లు వంటి కార్యక్రమాలకు రెండు రోజులు ముందే సువిధ పోర్టల్ ద్వారా అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎన్నికల ప్రచారంలో ఎలాంటి ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొనరాదని స్పష్టం చేశారు. అంతే కాకుండా రూ.50 వేలు దాటి నగదుతో ప్రయాణిస్తే సీజ్ చేయడం జరుగుతుందన్నారు. ఆ డబ్బుకు సరైన ఆధారాలు చూపిస్తే అధికారులు విచారణ జరిపిస్తారన్నారు. ప్రత్యేక నిఘా నీడలో ఎన్నికల కమిషన్ అధికారులు ఉంటారన్నారు. నాలుగు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలు, పోలీస్ అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



గంట్యాడ: కొండతామరపల్లి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

గంట్యాడ: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ పి.నీలకంఠేశ్వర రెడ్డి, ఎస్.ఐ సురేంద్రనాయుడు శుక్రవారం పరిశీలించారు. కొండతామరపల్లి గ్రామంలోని పోలింగ్ బూత్ 185, 186, గంట్యాడ గ్రామంలోని 203, 204, 205, తాటిపూడి 174 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల నిర్వాహణకు అవసరమయ్యే కనీస మౌలిక సదుపాయాలను పరిశీలించారు.

కోడ్ అమలుపై ప్రత్యేక దృష్టి

దత్తిరాజేరు: సచివాలయాల పరిధిలో ఉన్న కార్యదర్శులు నిత్యం ఎన్నికల కోడ్ అమలుపై దృష్టి సారించాలని ఎంపీడీఓ చంద్రకుమారి, తహసీల్దార్ సుదర్శన్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, బీఎల్వోలుతో శుక్రవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు తదితర వాటిని పరిశీలించి ఎప్పటికప్పుడు నివేదికలు అందజేయాలని కోరారు. పథకాలకు సంబంధించిన పోస్టర్లు ఎక్కడా కనిపించకుండా స్టిక్కర్లు వేయాలని రాజకీయ పార్టీలు ప్లెక్సీలు, వాల్ పోస్టర్లు లేకుండా చూడాలని సూచించారు.

ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గజపతినగరం : మండలంలోని మరుపల్లి ఆదర్శ పాఠశాలలో వచ్చే విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశానికి ఐదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ గెద్ద ఈశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఆరో తరగతిలో చేరేందుకు మార్చి నెల 31 వరకు గడువు ఉందని తెలిపారు. ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్ష జరగనున్నట్టు పేర్కొన్నారు. మరుపల్లి ఏపీ మోడల్ స్కూల్‌లో రానున్న విద్యా సంవత్సరం నుంచి 7వ తరగతి నుంచి పదో తరగతి వరకు సీబీఎస్ఈ సిలబస్ మాత్రమే ఉంటుందని తెలిపారు. ఆరో తరగతి మాత్రం ఏడాది స్టేట్ సిలబస్ ఉంటుందన్నారు.

ఆరోగ్య విద్యపై అవగాహన



ఆరోగ్య విద్యపై శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనర్ డాక్టర్ సాయికృష్ణారెడ్డి

గజపతినగరం: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గ్రామ సచివాలయాల్లో పని చేస్తున్న ఎమ్ఎల్‌హెచ్‌పీలు అంతా ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించాలని కేర్ క్యాంపెనియన్ మాస్టర్ ట్రైనర్ డాక్టర్ సాయికృష్ణ రెడ్డి తెలిపారు. జాతీయ ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో గజపతినగరం మండలం మరుపల్లి పీహెచ్‌సి వద్ద మరుపల్లి, చల్లపేట, దత్తిరాజేరు, కె.కొత్తవలస పీహెచ్‌సీల (ఎమ్ఎల్‌హెచ్‌పీలకు)సిబ్బందికి ఆరోగ్య విద్యపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అనారోగ్యంతో ఉన్న రోగులను గుర్తించి వారికి ఆయా కుటుంబ సభ్యులు ఎలా సేవలు అందించాలి, ఏ విధంగా చూసుకోవాలన్న అంశాలపై ఎమ్ఎల్‌హెచ్‌పీలకు వివరించారు. కార్యక్రమంలో కేర్ క్యాంపెనియన్ జిల్లా నోడల్ ఆఫీసర్ సంజయ్, మరుపల్లి పీహెచ్‌సీ వైద్యుడు అనూజ్ రాయ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

బలభద్రరాజపురంలో వైద్య శిబిరం



రోగులకు మందులు అందజేస్తున్న వైద్యాధికారి ఆనంద్‌కుమార్

దత్తిరాజేరు: మండలంలోని బలభద్రరాజపురంలో 104 ద్వారా వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. శిబిరంలో 40 మందికి వైద్య సేవలు అందించినటుట దత్తిరాజేరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఆనంద్‌కుమార్ తెలిపారు. గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు.

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా సమన్వయకర్త పద్మజ

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట ఏపీ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను గురుకుల పాఠశాల సమన్వయకర్త టి.పద్మజ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులతో మాట్లాడారు. ఇప్పటి వరకు జరిగిన పరీక్షలు ఎలా రాసింది అడిగి తెలుసుకున్నారు. ఇకపై జరగబోయే పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. శతశాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలన్నారు. అనంతరం ఎనిమిది, తొమ్మిదో తరగతి బ్రిడ్జి కోర్సు తరగతులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం రుచి చూశారు. ఆమె వెంట వైస్ ప్రిన్సిపాల్ ఉషారాణి, ఉపాధ్యాయురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సంతాపం



బుచ్చిం నాయుడు (ఫైల్)

గంట్యాడ: గుండె పోటుతో హెల్త్ అసిస్టెంట్ ఒకరు మృతి చెందారు. మండలంలోని పెదమజ్జిపాలేం గ్రామానికి చెందిన మజ్జి బుచ్చింనాయుడు (54) శుక్రవారం ఉదయం ఇంట్లో గుండె పోటు రావడంతో విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. బుచ్చింనాయుడు గజపతినగరం మండలం మరుపల్లి పీహెచ్‌సీలో హెల్త్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. ఆయన మృతికి పలువురు హెల్త్ అసిస్టెంట్‌లు సంతాపం తెలిపారు.

‘ఆరోగ్య సురక్ష’లో విస్తృతంగా వైద్య పరీక్షలు



జామి: వీఆర్‌పాలెంలో మందులు పంపిణీ



గజపతినగరం: ఆరోగ్య సురక్షలో రోగులను తనిఖీ చేస్తున్న వైద్యులు

గజపతినగరం : గజపతినగరం గ్రామ సచివాలయం–2 పరిధిలో శుక్రవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 375మంది రోగులకు ఉచితంగా ఆరోగ్య తనిఖీలు, 244మంది రోగులకు రక్త పరీక్షలు చేసినట్టు మరుపల్లి పీహెచ్‌సీ వైద్యులు సుష్మా, పుష్పాంజలి తెలిపారు. మండల కేంద్రంలో నిర్వహించిన ఆరోగ్య సురక్షలో రోగులకు తనిఖీలు చేస్తూ వారు విలేకరులతో మాట్లాడారు. ఆరోగ్య సురక్షలో ఇద్దరు రోగులకు ఇసీజీలు, 138 మందికి సుగర్ పరీక్షలు, 31మందికి బీపీ, 39మంది చిన్నారులకు, 96మందికి హెచ్‌బీ పరీక్షలు చేసి మందులు అందజేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ సాయిచరణ్, ఆప్తాలమిక్ ఆఫీసర్ డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

186 మందికి ఆరోగ్య పరీక్షలు

జామి: మండలంలో వి.ఆర్.పాలెం గ్రామంలో జామి పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్.సామ్రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో రెండవ విడత ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. మొత్తం 186 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఇద్దరిని మెరుగైన వైద్య సహాయం నిమిత్తం కార్పొరేట్ ఆస్పత్రికి రిఫర్ చేశారు. వైద్యులు సామ్రాజ్యలక్ష్మీతో పాటు కృష్ణ కుమారి, ఐ.ఉదయ్‌కుమార్ రోగులను తనీఖీ చేశారు. రోగులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఫోరెన్స్, భవాని, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



దత్తిరాజేరు: ఆరోగ్య సురక్ష శిబిరంలో రోగి వివరాలు సేకరిస్తున్న డా.పద్మావతి

ఆరోగ్య సురక్షకు స్పందన

దత్తిరాజేరు: మండలంలోని షికారుగంజిలో కె.కొత్తవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు రఘు ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరోగ్య సురక్ష – 2 క్యాంప్‌కు మంచి స్పందన లభించింది. గైనకాలజిస్ట్ పద్మావతి, చిన్న పిల్లల వైద్యులు లలిత, ఆప్తాల్మిక్ వైద్యులు ఎల్ఎస్ మూర్తి ఆధ్వర్యంలో 256 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ గిరిబాబు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో విద్యార్థుల వివరాలు



రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ విజయ్‌కుమార్

నెల్లిమర్ల: విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరచాలని ఎంఈఓ -2 ఈపు విజయ్‌కుమార్ అన్నారు. ప్రైవేట్ పాఠశాలల పర్యవేక్షణలో భాగంగా నెల్లిమర్ల నగర పంచాయతీ 11వ వార్డులో గల ఆదిత్య పబ్లిక్ స్కూల్‌ను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్ అటెండెన్స్, అడ్మిషన్ రికార్డులు, ఉపాధ్యాయుల వివరాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రైవేట్ పాఠశాలల్ల విద్యార్థులను అడ్మిట్ చేసుకునేటప్పుడు బర్త్ సర్టిఫికెట్, విద్యార్థి ఆధార్, తల్లిదండ్రుల ఆధార్ కార్డు వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. అలాగే టీసీ లేదా రికార్డ్ షీట్ ద్వారా అడ్మిషన్ ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎంవి. అమృత, ఎస్‌కే బేగం పాల్గొన్నారు .